

## నిమ్మపల్లి ప్రాజెక్ట్‌కు జలకళ

కోనరావుపేట(వేములవాడ): నిమ్మపల్లిలోని మూలవాగు ప్రాజెక్ట్‌లోకి వరదనీరు భారీగా చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు సామర్థ్యం 19 అడుగులకు నీరు చేరింది.



## కూలి తగ్గించొద్దు

సిరిసిల్లటౌన్: పవర్‌లూమ్ కార్మికుల కూలి తగ్గించొద్దని, 2022 ఒప్పందం ప్రకారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణ కోరారు. సోమవారం యజమానులకు విన్నవించారు.

## వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0/26.0

ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం పడే అవకాశం లేదు. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి వేళ చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### అవ్వతాతలకు లేఖ

- సిరిసిల్లలో వినిపించిన కార్యక్రమం



**సిరిసిల్లఎడ్యుకేషన్/తంగళ్లపల్లి:** సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేటి సమాజంలో ప్రజల మధ్య బంధాలు కనుమరుగవుతున్నాయని, బంధాల బలోపేతానికి 'అవ్వతాతలకు లేఖ' అనే కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్, తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల జెడ్పీ పాఠశాలలో సోమవారం పత్తిపాక ఫౌండేషన్, గరిపెల్లి ట్రస్ట్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని పాఠశాల హెచ్‌ఎం భాగ్యరేఖ తెలిపారు. ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులతో లేఖలు రాయించారు. ప్రకాశ్, లక్ష్మారెడ్డి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### 'మిడ్‌మానేరు నీటిని విడుదల చేయాలి'



**ఇల్లంతకుంట(మానకొండూర్):** ఇల్లంతకుంట మండలంలోని ఆయకట్టుకు మిడ్‌మానేరు నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతూ మండల రైతులు సోమవారం వంతడుపులలో ధర్నాకు దిగారు. వంతడుపుల, కందికట్కూర్, పొండలాపురం, గాలిపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు ఏఈ జయశ్రీ, ఇల్లంతకుంట మండల రెవెన్యూ అధికారి అక్కడికి చేరుకొని ఈనెల 15లోపు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. రైతులు శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


### ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు అందజేత



**బోయినపల్లి(చొప్పదండి):** హైదరాబాద్ అఫ్జల్ గంజ్ సెంట్రల్ లైబ్రరీలో సోమవారం నిర్వహించిన జాతీయ గ్రంథపాలకుల దినోత్సవంలో బోయినపల్లి లైబ్రేరియన్ కమటం మల్లయ్య జిల్లా ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు అందుకున్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ప్రొఫెసర్ రియాజ్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

### ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**బోయినపల్లి(చొప్పదండి):** అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మండలంలోని 22 గ్రామాలకు చెందిన 88 మందికి కల్యాణలక్ష్మీ చెక్కులు సోమవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ డి.పుష్పలత, ఎంపీవో ప్రణీత, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి లాయర్ల రిలేదీక్షలు

**సిరిసిల్లటౌన్:** సివిల్ కేసుల్లో నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు తమపై కేసులు నమోదు చేయడంపై కొద్దిరోజులుగా సిరిసిల్లలో న్యాయవాదులు న్యాయపోరాటం చేస్తున్నారు. పన్నెండు రోజులుగా కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు మంగళవారం నుంచి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల సంజీవరెడ్డి సోమవారం ప్రకటించారు. మంగళవారం నుంచి రిలేదీక్షలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం తదితరులు ఉన్నారు.



# మత్తు వదలరా..

- రంగంలోకి నార్కోటిక్ బ్యూరో
- వ్యసనపరుల గుర్తింపు ముమ్మరం
- ప్రతీ మెడికల్ కాలేజీలో డీ అడిక్షన్ సెంటర్
- ఒక్కో కేంద్రంలో పది పడకల కేటాయింపు
- ఆరంభ స్థాయికి ఇక్కడే వైద్యం.. ముదిరితే రాజధానికి
- కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, రామగుండంలో సేవలు

**సాక్షిప్రతినిధి, కరీంనగర్:** మత్తు ఒక వ్యసనం. అది ఏ రూపంలోనైనా ఉండొచ్చు. గంజాయి, మద్యం, కల్తీకల్లు, హషీశ్, వైట్‌నర్ లాంటి ద్రావణాలు మత్తు కలిగిస్తూ మనుషులు విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారు. డబ్బు కోసం కుటుంబ సభ్యులను పీడించడం, వేధించడం.. చంపడానికీ వెనుకాడడం లేదు. ఇలాంటి వారిని గుర్తించి వీలైనంత వరకు మార్పు తెచ్చేలా రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో(టీజీ ఏఎన్‌బీ) నడుం బిగించింది. అందుకే, మత్తుకు బానిసైన వారిని గుర్తించి చికిత్స అందించే దిశగా ఏర్పాట్లు చేసింది. ఇందు కోసం ప్రతీప్రభుత్వ మెడికల్ కాలేజీకి ఒక డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసింది. చికిత్స చేసేందుకు 10 బెడ్లు సిద్ధం చేసింది.

**ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారంటే..**

మత్తుకు బానిసైన వారిలో పరివర్తన తెచ్చేలా వైద్య చికిత్స అందించేందుకు డి-అడిక్షన్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రత్యేక విభాగం, పదేసి పడకలు సిద్ధం చేసింది. కరీంనగర్, జగిత్యాల, గోదావరిఖని, రాజన్న సిరిసిల్లలోని గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రుల్లో అందుబాటులోకి తీసుకొచ్చింది. వాస్తవానికి ఈ ఏర్పాట్లు గతేడాది సెప్టెంబరులోనే మొదలయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ మహమ్మారిని తరిమేయాలన్న లక్ష్యంతో వ్యసనపరులను గుర్తించి చికిత్స అందించాలని నిర్ణయించింది. తద్వారా వ్యసనపరుల సంఖ్యను వీలైనంతగా తగ్గించాలని లక్ష్యంగా నిర్దేశించింది.

**గ్రామస్థాయి నుంచి గుర్తింపు..**

మత్తుకు బానిసైన వారికి తప్పకుండా వైద్య చికిత్స అందించాలని గత జూన్ 6న అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. వీరితోపాటు పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇందుకోసం సినిమా హాళ్లతోపాటు, స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల్లోనూ డ్రగ్స్‌పై ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. గంజాయి వినియోగం పట్టణాల నుంచి గ్రామస్థాయికి పాకింది. అందుకే, వ్యవసనపరులను గుర్తించేందుకు ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పీహెచ్‌సీ, మెప్మా సిబ్బంది, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు(ఏఈవో), పంచాయతీ సిబ్బంది, అధికారులు, వార్డు సభ్యులను ఇందులో భాగస్వాములను చేస్తోంది. పాఠశాలల సిబ్బంది, విద్యార్థి నాయకులు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా వ్యసనపరులను గుర్తించి మెడికల్ కాలేజీలకు తీసుకువెళ్తారు. మత్తుకు బానిసైన వారికి అక్కడ మానసికంగా కౌన్సెలింగ్ ఇస్తారు. వైద్య చికిత్స చేస్తారు. వ్యసనం బాగా ముదిరిన కేసులను హైదరాబాద్‌కు తరలిస్తారు.

### వ్యసనపరులకు వైద్యం



మత్తు పదార్థాలకు బానిసలైన వారికి వైద్య చికిత్స అందించేందుకు ప్రభుత్వం ఒక్కో మెడికల్ కాలేజీలో పది పడకలు కేటాయించింది. గంజాయికి బానిసలైన వారిని గుర్తించి ఆస్పత్రికి తీసుకొస్తే సైకియాట్రిస్ట్‌తో చికిత్స చేయిస్తారు. మందులు అందజేస్తారు. వ్యసనపరులు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పిస్తారు. మానసిక సమస్యలు అధికంగా ఉంటే హైదరాబాద్‌కు రెఫర్ చేస్తారు.

– డాక్టర్ వీరారెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కరీంనగర్

### మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

**వేములవాడఅర్బన్:** యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్పీ చంద్రయ్య కోరారు. అగ్రహారం ఎస్సారార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నిర్వహించిన 'నశముక్త్ భారత్ అభియాన్'లో మాట్లాడారు. ఏఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ దేశప్రగతిని ముందుకు తీసుకెళ్లాల్సింది విద్యార్థులేనన్నారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ దేశంలో అధికంగా ఉన్న యువత తన బలాలను పెంచుకొని, బలహీనతలను తగ్గించుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలు తీసుకున్నట్లు తెలిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## వైభవంగా మహాలింగార్చన



**వేములవాడ:** శ్రావణమాసం రెండో సోమవారం సందర్భంగా రాజన్న ఆలయంలో మహాలింగార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్చకులు, భక్తులు భారీగా హాజరయ్యారు.

## చందుర్తి సింగిల్‌విండో సీఈవోగా శ్రీవర్ధన్



**చందుర్తి(వేములవాడ):** చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవోగా శ్రీవర్ధన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఈవో గంగారెడ్డి అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో మండలంలోని సనుగుల సింగిల్‌విండో సీఈవోగా పనిచేస్తున్న శ్రీవర్ధన్‌కు చందుర్తి సింగిల్‌విండో ఇన్‌చార్జి సీఈవోగా బాధ్యతలు అప్పగిస్తూ సహకార సంఘం జిల్లా అధికారి బుద్ధనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు సోమవారం బాధ్యతలు చేపట్టారు.

## కరీంనగర్ రీజియన్‌కు 70 ఎలక్ట్రిక్ బస్సులు

- ఇప్పటికే రెండో డిపోకు చేరుకున్న 33 బస్సులు
- ఈనెల 20లోపు ప్రారంభించేందుకు ఏర్పాట్లు



సూపర్ లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సు

**కరీంనగర్:** కొన్నేళ్లుగా నష్టాల ఊబిలో కూరుకుపోతున్న ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకువచ్చేందుకు సంస్థ ఎన్ని ప్రయత్నాలు చేసిన సఫలం కావడం లేదు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానమైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో సంస్థ మరింత నష్టాల్లోకి చేరుకుంది. దీంతో ఆర్టీసీ యాజమాన్యం నష్టాలను పూడ్చుకునే పనిలో కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూనే ఉంది. తాజాగా రాష్ట్రంలోని కొన్ని డిపోలను మెజర్స్ జేబీఎం అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని ప్రైవేట్‌పరం చేసే పనిలో నిమగ్నమైంది. ఇందులో భాగంగా కరీంనగర్- 2 డిపోతోపాటు నిజామాబాద్, వరంగల్, నల్గొండ, సూర్యపేట, హైదరాబాద్-2 డిపోలను ప్రైవేట్ మేనేజ్‌మెంట్‌కు అద్దెకు ఇచ్చి ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు మెజర్స్ జేబీఎం సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈక్రమంలో కరీంనగర్- 2 డిపోకు ఎలక్ట్రిక్ బస్సులు చేరుకోవడంతో వాటిని ప్రారంభించేందుకు మొదటగా ఈ డిపోనే ఎంపిక చేశారు.

**ఆర్టీసీ 2 డిపో ప్రైవేట్ పరం**

రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా కరీంనగర్-2 డిపో ప్రైవేట్‌పరం కానుంది. 2వ డిపోలో ఎలక్ట్రిక్ బస్సులు నడిపించేందుకు మెజర్స్ జేబీఎం సంస్థ ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా ఇప్పటికే డిపోకు 33 ఎలక్ట్రిక్ బస్సులు చేరుకున్నాయి. కరీంనర్ రీజియన్ పరిధి నుంచి 70 ఎలక్ట్రిక్ బస్సులు వివిధ రూట్లల్లో నడిపించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈనెల 20 లోపు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా బస్సులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రెండో డిపో నుంచి ప్రస్తుతం ఆర్టీసీ 53 సొంత, 52 అద్దె బస్సులు ఆపరేట్ చేస్తుంది. 360 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. డిపోను ప్రైవేట్ పరం చేస్తుండడంతో కండక్టర్లు మినహా మిగతా ఉద్యోగులను ఇతర డిపోల్లోకి కేటాయించేందుకు సర్దుబాటు ప్రక్రియ చేపట్టారు. కాగా సదరు డిపోలో పనిచేస్తున్న సిబ్బంది స్థానచలనంపై అయోమయంలో ఉన్నారు.

**ఏర్పాట్లలో అధికార యంత్రాంగం**

కరీంనగర్-2 డిపోకు ఎలక్ట్రిక్ బస్సులు రానుండడంతో అధికారులు మౌలిక వసతుల ఏర్పాట్లపై దృష్టిసారించారు. డిపోలో ఇప్పటికే 11కేవీ విద్యుత్ లైన్లు, 14 చార్జింగ్ పాయింట్లు, 3 ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించే పనిలో పడ్డారు.

### రీజియన్ నుంచి రూట్‌లోకి వెళ్లే బస్సులు ఇలా..

| రూటు | బస్సుల సంఖ్య |
|---|---|
| కరీంనగర్- జేబీఎస్ | 33 |
| కరీంనగర్- సీబీఎస్ | 06 |
| కరీంనగర్- గోదావరిఖని | 09 |
| కరీంనగర్- మంథని | 04 |
| కరీంనగర్- కామారెడ్డి | 06 |
| కరీంనగర్- జగిత్యాల | 06 |
| కరీంనగర్- సిరిసిల్ల(నాన్‌స్టాప్) | 06 |
| మొత్తం | 70 |

### ఏర్పాట్లు చేస్తున్నాం



ఎలక్ట్రిక్ బస్సులను ఈనెల 20లోపు ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు చేశాం. రీజియన్ నుంచి 70 బస్సులను వివిధ రూట్లలో నడిపించేందుకు సన్నాహాలు చేపట్టాం.

– సుచరిత, ఆర్టీసీ ఆర్‌ఎం

## స్వాతంత్య్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- జిల్లా అధికారులతో సమీక్ష..



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

**సిరిసిల్ల:** స్వాతంత్య్ర వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఏఎస్పీ చంద్రయ్యలతో కలిసి స్వాతంత్య్ర వేడుకలపై సమీక్షించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ స్వాతంత్య్ర వేడుకలు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది, విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ స్టాళ్లను రూపొందించాలని సూచించారు. దేశభక్తి గేయాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జూనియర్ కాలేజీ మైదానాన్ని శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

**ఉత్తమ పనితీరుకు ప్రశంసాపత్రాలు**

విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసేందుకు ప్రతిపాదనలు ఈనెల 14లోపు పంపాలని తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, స్వాతంత్య్ర సమరయోధులను ఆహ్వానించాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డీఆర్‌డీవో శేషాద్రి, డీపీవో వీరబుచ్చయ్య, డీఏవో భాస్కర్, జౌళిశాఖ ఏడీ సాగర్, డీఈవో రమేశ్‌కుమార్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి పంచాక్షరి, డీసీవో బుద్ధనాయుడు, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, డీటీవో లక్ష్మణ్, మైనింగ్ ఏడీ క్రాంతికుమార్, ఎల్‌డీఎం మల్లికార్జున్ పాల్గొన్నారు.

# మురుగు పారుతోంది !

- సాగునీటి కాల్వలు.. మురుగునీటిమయం
- చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో దుర్వాసన
- అనారోగ్యం బారిన రైతులు
- మురుగుకు చెక్ పెట్టాలని డిమాండ్



మానేరు కెనాల్‌లో పారుతున్న మురుగునీరు



కెనాల్‌లోకి వస్తున్న ముస్తాబాద్‌లోని మురుగు

**ముస్తాబాద్(సిరిసిల్ల):** మానేరుకాల్వల్లో మురుగునీరు పారుతోంది. కంపుకొడుతున్న కాల్వల్లో దిగి నీరు పారిచ్చేందుకు రైతులు జంకుతున్నారు. మురుగునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలతో కాల్వలు పేరుకుపోతున్నాయి. గ్రామాల నుంచి వస్తున్న మురుగునీరు డైరెక్ట్‌గా ఎగువమానేరు కాల్వల్లో కలుస్తుండడంతో రోగాలు వస్తాయని రైతులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సాగునీటి కాల్వల్లోకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

**నిజాంకాలం నాటి కాల్వలు**

ఎగువమానేరు ప్రాజెక్టు కాల్వలు నిజాం కాలంలో నిర్మించినవి. సిరిసిల్ల మెట్ట ప్రాంతంలో పంటల సాగుకు ఎగువమానేరు నీరే ఆధారం. మానేరు ప్రాజెక్టు కుడికాలువ ద్వారా 15వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేస్తున్నారు. ప్రాజెక్టు కెనాల్స్‌లోకి మురుగునీరు, చెత్త, ప్లాస్టిక్ వస్తువులు వచ్చి చేరడం పెద్ద సమస్యగా మారింది. ఎగువమానేరు ప్రాజెక్టు కుడికాలువ నామాపూర్, గూడూరు, ముస్తాబాద్, పోతుగల్, తెర్లుమద్ది వరకు ఉంది. నామాపూర్ నుంచి తెర్లుమద్ది వరకు మానేరు కెనాల్‌లోకి మురుగునీరు వచ్చి చేరుతోంది. రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ఈ మురుగునీరు, వ్యర్థాలు అడ్డంకిగా మారాయి.

**గూడూరు మీదుగా తెర్లుమద్ది దాకా..**

మానేరు కుడికాలువ నామాపూర్ మీదుగా గూడూరు, ముస్తాబాద్‌కు వస్తోంది. గూడూరు వద్ద మురుగునీరు కొంత కెనాల్‌లో చేరగా, ముస్తాబాద్‌లోని తొంభైశాతం మురుగునీటి కాల్వలు కెనాల్‌లోనే కలుస్తున్నాయి. 12వేల జనాభా గల ముస్తాబాద్ పట్టణం నుంచి టన్నుల సంఖ్యలో వ్యర్థాలు, ప్లాస్టిక్, బాటిల్స్‌తోపాటు మురుగునీరు నేరుగా మానేరుకెనాల్‌లో కలుస్తోంది. కొత్త బస్టాండ్ నుంచి పంట పొలాల మీదుగా కెనాల్‌లో కలుస్తుండగా, మరో మురుగుకాల్వ అండర్ టన్నెల్ నుంచి కెనాల్ కింది భాగం నుంచి నేరుగా పొలాల్లోకి వెళ్తోంది. ఇదే పెద్ద సమస్యగా మారింది. భారీ వరదలు వచ్చినప్పుడు మురుగుతోపాటు వ్యర్థాలు, చెత్త పొలాలను ముంచెత్తుతున్నాయి. మరో రెండు మురుగు కాలువలు, ఎస్సీకాలనీలో రెండు కాల్వలో కలుస్తున్నాయి. ప్రస్తుతం కెనాల్‌లోకి ప్రాజెక్టు నీరు రాకున్నా మురుగునీరు పెద్ద ఎత్తున చేరి ప్రవాహంలా వస్తోంది. విపరీతమైన దుర్వాసనతో సిల్ట్ చేరి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ-17, డీ-18, డీ-19 ద్వారా మురుగునీరు సరఫరా అవుతోంది.

**అనారోగ్యం పాలవుతున్న రైతులు**

కెనాల్ నుంచి వచ్చి చేరిన మురుగునీరు, చెత్త, వ్యర్థాలతో పంట పొలాలు నిండిపోగా, వరినాట్లకు కూలీలు రావడం లేదని రైతులు వాపోతున్నారు. మురుగునీటితో రైతుల కాళ్లు దురద లేచి, పుండ్లు పడుతున్నాయి. దుర్వాసనతో శ్వాసకోస వ్యాధులు వస్తున్నాయి. ముస్తాబాద్‌లో రత్నాలకుంట మురుగునీటితో నిండిపోగా, తెర్లుమద్ది వరకు అదే నీరు చేరుతోంది.

**కలెక్టర్‌పైనే ఆశలు..**

ప్రతీ సీజన్‌లో కెనాల్‌లోకి మురుగు, చెత్త చేరి నీరు కిందికి వెళ్లడం లేదు. దీంతో కెనాల్ మొత్తం మురుగుమయంగా మారుతుంది. వారం క్రితం ముస్తాబాద్‌కు వచ్చిన జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాకు రైతులు మానేరు కెనాల్ దుస్థితిని చూపించారు. స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్ ద్వారా మురుగునీరు కెనాల్‌లో చేరకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముస్తాబాద్ కొత్తబస్టాండ్ నుంచి పారే మురుగు కాల్వను నామాపూర్ వైపున్న బుగ్గవాగులో కలపాలని ఇంజినీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 1,600 మీటర్ల మేరకు డ్రెయినేజీ నిర్మించాలని పేర్కొన్నారు. తెర్లుమద్ది వైపు మరో డ్రెయినేజీని నిర్మించాలని స్పష్టం చేశారు.

### పొలాల్లోకి దిగలేకపోతున్నం



ముస్తాబాద్‌లో మానేరుకెనాల్ కింద సాగుచేస్తున్న పంట పొలాల్లోకి మురుగునీరు చేరుతోంది. కూలీలు, రైతులు వరినాట్లకు పొలాల్లోకి దిగడం లేదు. చెత్త, వ్యర్థాలతో నీరంతా కెనాల్ డీ-17 నుంచి పొలాలకు వస్తోంది. అనారోగ్యానికి గురవుతున్నాం. పంటలు దెబ్బతింటున్నాయి.

– తాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ముస్తాబాద్

### ప్రమాదకరంగా కెనాల్



ముస్తాబాద్‌లో డీ-17, డీ-18 మధ్య కెనాల్ కట్ట బలహీనంగా ఉంది. మురుగునీరు చేరి, భారీ వరదలు వచ్చినప్పుడు కెనాల్‌లోని చెత్తతో నీరు వెనక్కి వస్తుంది. దీంతో కెనాల్ కట్ట వరదలకు కొట్టుకుపోయింది. పంట పొలాల్లోకి నీరు వస్తోంది. భారీ నష్టం జరుగుతోంది. రైతులే స్వయంగా కెనాల్ కుంగకుండా మట్టిని పోయించుకున్నారు.

– కె.రాజిరెడ్డి, ముస్తాబాద్

### శాశ్వత పరిష్కారం

మానేరు ప్రాజెక్టు మురుగునీటితో కెనాల్స్ దెబ్బతింటున్నాయి. దాదాపు 5 కిలోమీటర్ల పరిధిలో మురుగు సమస్య ఉంది. కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలతో మురుగునీటిని బుగ్గవాగులోకి మళ్లించాలనే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతానికి రూ.2లక్షలతో కెనాల్స్ శుభ్రం చేయిస్తాం.

– రవికుమార్, డీఈఈ

## రైతులకు అందిన యూరియా



అల్మాస్‌కుపూర్‌లో యూరియా లారీ

సాక్షి ఎఫెక్ట్

**ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల):** పది రోజులుగా యూరియా కొరత వెంటాడుతుండగా.. ఎల్లారెడ్డిపేట మండలంలో ఒకే రోజు అధికారులు తొమ్మిది లారీ లోడ్లు తెప్పించడంతో కొరత తీరింది. రైతులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలో నెలకొన్న యూరియా కొరతపై సోమవారం 'సాక్షి'లో 'యూరియా కష్టాలు తీరేదెప్పుడో' అనే శీర్షికతో వచ్చిన కథనానికి వ్యవసాయశాఖ, సింగిల్‌విండోల అధికారులు స్పందించారు. ఒకే రోజు మండలంలో తొమ్మిది లారీ లోడ్‌ల యూరియాను తెప్పించి రైతులకు పంపిణీ చేశారు. ఒక్క అల్మాస్‌పూర్ సొసైటీకి నాలుగు లోడ్‌ల యూరియా వచ్చింది. అక్కపల్లి గ్రామ రైతులకు ఒక లోడ్ అనగా 450 బస్తాల యూరియాను తెప్పించి రైతులకు అందజేశారు. పెద్ద మొత్తంలో యూరియాను తెప్పించి రైతులకు పంపిణీ చేశామని మండల వ్యవసాయాధికారి భూంరెడ్డి తెలిపారు.

## క్లుప్తంగా

### గల్ఫ్ బాధితుడికి ప్రభుత్వ విప్ అండ


నర్సయ్య

సిరిసిల్ల: ఉపాధి కోసం బెహ్రెయిన్ వెళ్లిన జిల్లా వాసి పాస్‌పోర్ట్ పోగొట్టుకొని జైల్లో బంధీ అయిన ఘటనపై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన మానువాడ నర్సయ్య (62)ను స్వదేశానికి క్షేమంగా రప్పించేలా చూడాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బహ్రెయిన్‌లోని భారత రాయభార కార్యాలయం (ఎంబసీ) అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ఎంబసీ అధికారులకు లేఖ రాశారు. నర్సయ్య స్వదేశానికి రప్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం తరఫున ఇండియన్ ఎంబసీ, బహ్రెయిన్ దేశానికి లేఖ రాసి అధికారులతో మాట్లాడామని, ఇండియాకు వచ్చేవరకు నర్సయ్యకు అండగా ఉంటానని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

### నగల దుకాణంలో చోరీ


విచారణ జరుపుతున్న పోలీసులు

పెద్దపల్లిరూరల్: స్థానిక హనుమాన్‌నగర్‌లోని అనీలా నగల దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దుకాణం వద్ద అమర్చిన సీసీ కెమెరా వైరు కత్తిరించిన దొంగలు.. షట్టర్ పైకి లేపి లోనికి చొరబడ్డారు. 3 తులాల బంగారం, కిలోన్నర వెండి ఎత్తుకెళ్లారని యజమాని విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై లక్ష్మణ్‌రావు ఘటనాస్థలానికి చేరుకుని ఆరా తీశారు. దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. విజయకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

### పండ్లను ఆహారంగా తీసుకోవాలి


చిన్నారులతో నరేందర్‌రెడ్డి

జగిత్యాల: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు రకరకాల పండ్లను ఆహారంగా తీసుకోవాలని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. అల్ఫోర్స్ కళాశాలలో సోమవారం ఫ్రూట్స్‌ఫెస్టివల్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీజనల్ ఫ్రూట్స్ తప్పకుండా తీసుకోవాలన్నారు. దీంతో మేధాశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

### లింక్ క్లిక్ చేసి డబ్బులు పోగొట్టుకున్న యువకుడు

జమ్మికుంట: ఆన్‌లైన్ లింక్ క్లిక్ చేసి డబ్బులు పోగొట్టుకోగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు. వివరాలు...మండలంలోని నాగంపేటకు చెందిన పంజాల తిరుపతి తన స్నేహితుడికి ఫోన్‌పే ద్వారా కొంత డబ్బులు ట్రాన్సాక్షన్ చేసే క్రమంలో కాలేదని అనుకున్నాడు. దీంతో ఆంధ్రాబ్యాంక్ కస్టమర్ కేర్‌కు ఫోన్‌చేశాడు. వారు అడిగిన వివరాలన్నీ తెలపగా తిరుపతి అకౌంట్ నుంచి రూ.1,40,999 కట్ అయ్యాయి.



# అర్జీలు పరిష్కరించండి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- వివిధ సమస్యలపై 131 దరఖాస్తులు

సిరిసిల్లఅర్బన్: ప్రజావాణి అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పలువురు బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా దరఖాస్తులను సంబంధిత అధికారులకు బదిలీ చేసి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ 74, ఎంపీడీవో 1, డీఎంహెచ్‌వో 4, ఎంసీ సిరిసిల్ల 12, డీఎం ఆర్‌టీసీ 1, ఎంపీడీవో కోనరావుపేట 2, డీడబ్ల్యూవో 5, ప్రొహిబిషన్ 1, అగ్రికల్చర్ 5, ఎంసీ వేములవాడ 1, ఎంపీడీవో గంభీరావుపేట 1., ఎంప్లాయిమెంట్ 3, ఎడ్యుకేషన్ 1, డీసీఎస్‌వో 5, డీఆర్‌డీఏ 2, ఎంపీడీవో ముస్తాబాద్ 2.. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులు మొత్తం 131 వచ్చాయి.


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

### ఉపాధి చూపండి



నేను వికలాంగుడిని. బయట పనులు చేసే పరిస్థితి లేదు. నాకు ఏదైనా ఉద్యోగం ఇప్పించి, ఉపాధి చూపండి. గత కలెక్టర్‌కు కూడా విన్నవించుకున్న. నాపైన సార్లు దయచూపాలి.

– మినుప రాజు, ముస్తాబాద్

### స్కూటీ ఇప్పించండి



మాది వేములవాడ మండలం రుద్రవరం. నాకు ఒక కాలు లేదు. ఏదైనా పని నిమిత్తం బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. నడవలేకపోతున్న. నా పరిస్థితిని అర్థం చేసుకొని స్కూటీ ఇప్పించి ఆదుకోండి.

– పార్వతి శ్రీనివాస్, రుద్రవరం

### డబుల్ బెడ్‌రూమ్ ఇప్పించండి



మాది సిరిసిల్ల పట్టణం. మాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. నా పేరు కోడం సురేష్, మాది సిరిసిల్ల పట్టణం, మాకు ఎటువంటి ఆస్తిపాస్తులు లేవు, మాకు వికలాంగుడైన కొడుకు ఉన్నాడు. మాకు డబుల్ బెడ్ రూం ఇప్పించండి.

– కోడం సురేశ్, సిరిసిల్ల

## ముగిసిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

- అండర్– 12, 15 విజేతలుగా నిజామాబాద్, ఖమ్మం

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని జీఎస్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో జరుగుతున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం ముగిశాయి. అండర్–12, అండర్–15 బాలబాలికలతో పాటు పురుషుల, మహిళల విభాగంలో పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో భాగంగా అండర్–12 బాలికలలో నిజామాబాద్, బాలురలో ఖమ్మం, అండర్–15 బాలికలలో మంచిర్యాల, బాలురలో ఖమ్మం జిల్లాల క్రీడాకారులుగా చాంపియన్‌గా నిలిచారు. పురుషుల సింగిల్స్‌లో కొత్తగూడెం, మహిళల సింగిల్స్‌లో నిజామాబాద్, పురుషుల డబుల్స్‌లో కొత్తగూడెం, మిక్స్‌డ్ డబుల్స్‌లో నిజామాబాద్ జిల్లాల క్రీడాకారులు చాంపియన్‌గా నిలిచారు. రాత్రి జరిగిన ముగింపు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.శరత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీ, మెడల్స్‌ను ప్రదానంచేశారు. భవిష్యత్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టేబుల్ టెన్నిస్ క్రీడకు ఆదరణ తీసుకువచ్చేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో టేబుల్ టెన్నిస్ సంఘం బాధ్యులు దారం గౌతమ్‌రెడ్డి, మద్దెల వికాస్, సురేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### అప్పు చెల్లించమని అడిగితే బెదిరింపులు'

- ట్రెయినీ కానిస్టేబుల్ శివకుమార్‌పై ఫిర్యాదు
- ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన బాధితుడు



వేములవాడ: అప్పు చెల్లించాలని అడిగినందుకు బెదిరింపులకు పాల్పడడంతోపాటు కులం పేరుతో దూషించిన వేములవాడకు చెందిన ట్రెయినీ కానిస్టేబుల్ గుమ్మడి శివకుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామానికి చెందిన మారుమొఖం రవి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, జాతీయ ఎస్సీ కమిషన్‌లకు, డీజీపీలకు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితుడు రవి తెలిపిన వివరాలు ఇలా.. ఆదిలాబాద్‌లో శిక్షణ పొందుతున్న గుమ్మడి శివకుమార్ తండ్రి సత్యనారాయణ తన దగ్గర రూ.7లక్షలు అప్పు తీసుకున్నట్లు తెలిపారు. ఆ అప్పును తిరిగి చెల్లించమని అడిగితే ట్రెయినీ కానిస్టేబుల్ శివకుమార్ కులం పేరుతో దూషించారన్నారు. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తనపై తప్పుడు కేసు పెట్టి నిందితులకు వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. ఈ విషయమై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, జాతీయ ఎస్సీ కమిషన్‌లకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. బాధితుడితో డీబీఎఫ్ నేతలు పి.శంకర్, పులి కల్పన ఉన్నారు.

## దారిచూపిన రుణమాఫీ

- నిన్న కూలీ... నేడు యజమాని
- రుణమాఫీ డబ్బులతో దుకాణం పెట్టుకున్న పేయింటర్


దుకాణం ప్రారంభించిన చంద్రారెడ్డి

కోనరావుపేట(వేములవాడ): ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ పథకం ఓ జీవితానికి దారిచూపింది. నిన్నటి వరకు పేయింటర్‌గా పనిచేసిన అతడు రుణమాఫీ సొమ్ముతో నేడు దుకాణానికి యజమాని అయ్యాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన అండెం చంద్రారెడ్డి కొంతకాలంగా పేయింటర్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంతోపాటు చుట్టుపక్కల పల్లెల్లో ఇళ్లకు రంగులు వేస్తూ ఉపాధి పొందుతున్నాడు. చంద్రారెడ్డికి గ్రామంలోనే 2.05 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిపై స్థానిక బ్యాంక్‌లో రూ.80వేలు రుణం తీసుకున్నాడు. అయితే తెలంగాణ ప్రభుత్వం ఇటీవల రుణమాఫీ అమలు చేయడంతో రూ.80వేలు మాఫీ అయ్యింది. ప్రభుత్వం నుంచి వచ్చిన రుణమాఫీ డబ్బులతో చంద్రారెడ్డి పేయింటింగ్ దుకాణాన్ని సోమవారం ప్రారంభించాడు.

### చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలోని ఎనిమిది మండలాల్లో సోమవారం చిరుజల్లులు కురిశాయి. అత్యధికంగా ఎల్లారెడ్డిపేట మండలంలో 11 మిల్లీమీటర్ల వర్షం పడగా.. సిరిసిల్లలో 0.5, కోనరావుపేటలో 7.0, వీర్నపల్లిలో 3.6, గంభీరావుపేటలో 6.0, ముస్తాబాద్‌లో 9.4, తంగళ్లపల్లిలో 0.5, ఇల్లంతకుంటలో 1.0 మిల్లీమీటర్ల వర్షం పడింది.

## మెరుగైన విద్య అందించడమే లక్ష్యం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- కొదురుపాక హైస్కూల్ ఆకస్మిక తనిఖీ


కొదురుపాక హైస్కూల్‌లో కలెక్టర్

బోయినపల్లి(చొప్పదండి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించడమే లక్ష్యమని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. మండలంలోని కొదురుపాక హైస్కూల్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు విద్యార్థులను పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు అడిగి సమాధానాలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. మిడ్‌డే మీల్స్ ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గది, వంట గది, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. హెడ్‌మాస్టర్ ఉషారాణి ఉన్నారు.

### హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి

తిమ్మాపూర్: ప్రతీ ప్రాథమిక పాఠశాలకు హెడ్‌మాస్టర్ పోస్ట్ మంజూరు చేసి అర్హత కలిగిన ఉపాధ్యాయులతో వెంటనే భర్తీ చేయాలని ఎస్టీయూ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పీఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రచారి డిమాండ్ చేశారు. తిమ్మాపూర్‌లో సోమవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. డీఎడ్, బీఎడ్ అర్హత కలిగిన ఉపాధ్యాయులందరికీ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పదోన్నతి కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలన్నారు. పాఠశాలలకు సర్వీస్ పర్సన్లను నియమించడానికి, ఉచిత కరెంట్ అమలుకు ఆదేశాలిచ్చిన ముఖ్యమంత్రికి జిల్లాశాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## స్థానిక ఎన్నికలకు సమాయత్తం

- ఓటరు నమోదుకు మరో అవకాశం
- ఈ నెల 20నుంచి బోగస్ ఓట్ల ఏరివేత

కరీంనగర్ అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల క్రమంలో ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు మరో అవకాశమిచ్చింది. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. ఓటరు నమోదుకు షెడ్యూల్ విడుదల చేయగా, బోగస్ ఓటర్లను ఏరివేసేందుకు ఈనెల 20 నుంచి ఇంటింటా సర్వే చేపట్టాలని బీఎల్‌వోలను ఆదేశించింది. ఈ క్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి తదనుగుణ ఆదేశాలు జారీ చేయగా అధికారులు సదరు పనుల్లో నిమగ్నమైంది. స్థానిక సంస్థల్లో యువత పాత్ర కీలకం. ఓటరు జాబితాలో పేరుందో లేదో చూసుకుని అప్రమత్తమవడం అత్యవసరం. జాబితాలో పేరు ఉందా.. లేదా అనేది ఒక్కసారి సరిచూసుకోండి. జాబితాలో పేరు లేకుంటే వెంటనే ఓటరు నమోదుకు దరఖాస్తు చేయండి.

**20 నుంచి ఏరివేత**

ఈ నెల 20వ తేదీ నుంచి బోగస్ ఓట్లను ఏరివేయనున్నారు. బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వో) వారివారి బూత్ పరిధిలో ఓటరు జాబితాతో ఇంటింటా వివరాలను ఆరా తీయనున్నారు. అనుమానమున్న ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించనున్నారు. అలాగే మరణించినవారు, వలసవెళ్లినవారి పేర్లను తొలగిస్తారు.

**ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేయండి**

ఓటరుగా నమోదు కావాలనుకునేవారు తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఫారం–6 తీసుకుని అందులో వివరాలు పొందుపరిచి అక్కడే కార్యాలయంలో సమర్పించాలి. ఆధార్ కార్డు, ఇంటి చిరునామాను సూచించే కరెంట్ బిల్లు, ఇతరత్రా ఏదేని ఆధారాన్ని జత చేయాల్సి ఉంటుంది. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విచారించి ఓటరుగా నమోదు చేయనున్నారు.

**పలు మార్గాలు**

క్యాంపెయిన్‌కు వెళ్లలేనివారు అరచేతిలోనే ఓటరుగా నమోదు కావచ్చు. http:/// voters. eci. gov. in వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. సర్వీస్ పోర్టల్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి అందులో మొబైల్ నంబర్‌తో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం లాగిన్ అవ్వాలి. ఆన్‌లైన్‌లో కొత్త ఓటుకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఫారం–6, జాబితా నుంచి పేరు తొలగింపుకు ఫారం–7, తప్పొప్పుల సవరణకు ఫారం–8, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం కోసం ఫారం–6బి కనిపిస్తాయి. వాటిలో మీకు కావాల్సిన దానిపై క్లిక్ చేసి అందులో పొందుపర్చాల్సిన వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి. వివరాలు ఏఈఆర్వోకు వద్దకు వెళ్తాయి. పరిశీలించి ఆమోదిస్తారు.

**యాప్‌తో కూడా..**

బీఎల్వో వద్దకు వెళ్లలేని వారు వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోలేని పరిస్థితుల్లో మీ వద్ద ఉన్న మొబైల్‌లో voter helpline mobile App యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిపై క్లిక్ చేయగానే పోర్టల్ ఓపెన్ అవుతుంది. కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చు. జాబితాలో పేరుందా.. లేదా చూసుకునే అవకాశం కల్పించారు.

**గుర్తింపు కార్డు పొందడమిలా**

ఓటరు గుర్తింపు కార్డు కావాలనుకునేవారు https:/// voters.eci.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అందులో ఈ–ఎపిక్ కార్డు డౌన్‌లోడ్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి మొబైల్, ఎపిక్ కార్డు నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గుర్తింపు కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం అయితే ఓటీపీ వస్తుంది. లేకుంటే రాదు. ఫారం–8 ద్వారా ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకోవచ్చు. తర్వాత గుర్తింపు కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# తల్లీ సాహితీ.. మాకు దిక్కెవరమ్మా..!

- పదో తరగతి విద్యార్థినికి గుండెపోటు
- కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు
- వైద్యుల తీరుపై కార్మిక సంఘాల ఆగ్రహం


సాహితి(ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): 'అమ్మా సాహితీ.. మమ్మల్ని విడిచి వెళ్లిపోయావా తల్లీ.. నీవు చక్కగా చదువుకుని భవిష్యత్‌లో ఎంతో ఎదగాలని ఆశించాం.. కానీ మమ్మల్ని ఇలా విడిచి వెళ్తావని అనుకోలేదమ్మా' అని ఆ తల్లి లక్ష్మి రోదిస్తున్న తీరు కంటతడి పెట్టించింది. ఎన్టీపీసీ ఆపరేషన్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న మల్లెపల్లి రాజలింగు–లక్ష్మి దంపతులకు సాత్విక, సాహితి కుమార్తెలు ఉన్నారు. పర్మినెంట్ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్నారు. పెద్దకుమార్తె సాత్విక డిగ్రీ చదువుతోంది. చిన్నకుమార్తె సాహితి(15) ఎన్టీపీసీ పీటీఎస్‌లోని సెయింట్ క్లేర్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఆదివారం సాయంత్రం ఉన్నట్టుండి సాహితి తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు వెంటనే టౌన్‌షిప్‌లోని ధన్వంతరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఆస్పత్రికి రెఫర్ చేశారు. అయితే, అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాహితి సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆమె మృతికి సంతాప సూచకంగా హైస్కూల్‌కు సెలవు ప్రకటించారు.

**వైద్యులపై గుర్తింపు సంఘం గరం?**

సాహితి గుండెపోటుతో మృతి చెందడంతో వైద్య బృందంపై ఉద్యోగ గుర్తింపు సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థినిని ఆస్పత్రిలో చేర్పిస్తే సరైన వైద్యం అందించలేదని ఆరోపించారు. ప్రథమ చికిత్స సైతం తూతూమంత్రంగా చేసి కరీంనగర్‌కు రెఫర్ చేశారని ధ్వజమెత్తారు. ప్రమాదకర పరిస్థితిలో ఉన్న విద్యార్థినికి చికిత్స అందించడంతో ఆస్పత్రి వర్గాలు విఫలమయ్యాయని విమర్శించారు. జాతీయ రంగ సంస్థ ఎన్టీపీసీ ఆస్పత్రిలో సరైన సమయంలో సరైన వైద్యం అందకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గుండెపోటు వచ్చిన విద్యార్థినిని కరీంనగర్‌కు రెఫర్ చేయడంతో ఆమెకు సరైన సమయంలో చికిత్స అందకపోవడంతోనే మృతి చెందిందని ఆరోపించారు. వైద్యుల తీరుపై యాజమాన్యం విచారణ చేపట్టాలని వారు కోరారు.

## ఇద్దరు పిల్లలను బడికి పంపి..

- ఆర్నెళ్ల పాపను పక్కింట్లో ఉంచి..
- ఆత్మహత్య చేసుకున్న వివాహిత


చిన్నారితో సృజన(ఫైల్)


సృజన పిల్లలు

కోరుట్ల: ఆ తల్లికి ముగ్గురు ఆరేళ్ల లోపు చిన్నారులే. పొద్దున్నే ఇద్దరిని చక్కగా తయారు చేసి బడికి పంపించింది. ఆరు నెలల పాపను పక్కింట్లో నిద్రపుచ్చింది. పాపకు మెలకువ వస్తే ఇంటికి తీసుకురమ్మని పక్కింటి వారికి చెప్పి మరీ వెళ్లింది. గంట గడిచినా తల్లి రాకపోయేసరికి.. పక్కింటి వారు పాపను ఇంటికి తీసుకెళ్లే సరికి ఆ తల్లి రేకుల షెడ్‌కు ఉరేసుకుని విగతజీవిగా కనిపించింది. ఈ సంఘటన కోరుట్లలో విషాదం నింపింది. ఎస్సై కిరణ్ కథనం ప్రకారం.. కోరుట్లలోని కాల్వగడ్డ దిగువ భాగంలో పులివేని శశికళ నివాసముంటోంది. ఆమె కొడుకు సురేశ్ కుటుంబ పోషణ కోసం పదేళ్లుగా గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. అతడికి ఏడేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామానికి చెందిన సృజనతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు మిథున్ (6), విహాన్స్(4), ఆరు నెలల కూతురు అనుమ ఉన్నారు. సురేశ్ ఆర్నెళ్ల క్రితమే కోరుట్లకు వచ్చి మళ్లీ గల్ఫ్ వెళ్లాడు. సోమవారం ఉదయం శశికళ తన బిడ్డ వద్దకని ఊరికి వెళ్లింది. సృజన తన కుమారులు మిథున్, విహాన్స్‌లను బడికి పంపించింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఆరునెలల పాప అనుమను తీసుకుని పక్కింటికి వెళ్లింది. పాప నిద్రపోగానే వారికి ఇచ్చి.. లేస్తే ఇంటికి తీసుకురమ్మని చెప్పి వెళ్లింది. పక్కింటి వారు కాసేపు చూసి పాపను తీసుకుని సృజన ఇంటికి వెళ్లగా ఆమె ఇంటి రేకులషెడ్‌కు చీరతో ఉరేసుకుని కనిపించింది. వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారం ఇవ్వగా బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు ఫయీం అక్కడికి వచ్చి పోలీసులకు విషయం చేరవేశాడు. ఎస్సై కిరణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. గల్ఫ్ నుంచి భర్త సురేశ్ పంపే డబ్బుల విషయంలో చిన్నపాటి గొడవలు ఉండటంతో సృజన ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సృజన మృతితో ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు. తల్లి మృతిచెందడం.. పిల్లలు రోదిస్తుండడాన్ని చూసి స్థానికులు కంటతడి పెట్టారు.

## దేవాదాయశాఖ ఏసీగా సుప్రియకు అదనపు బాధ్యతలు


నాయిని సుప్రియ

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌గా నాయిని సుప్రియకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర కమిషనర్ హనుమంతరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఆఫీస్‌లో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఇక్కడ ఏసీగా పనిచేసిన ఆకునూరి చంద్రశేఖర్ మెదక్ జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. సుప్రియ సహాయ కమిషనర్‌గా మంగళవారం అదనపు బాధ్యతలు స్వీకరించనున్నారు.

## 'మార్షల్ ఆర్ట్స్'లో విద్యార్థుల ప్రతిభ




సుల్తానాబాద్(పెద్దపల్లి): మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఐపీఎస్ పాఠశాల డైరెక్టర్ కృష్ణప్రియ అభినందించారు. పాఠశాల ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాలు అందించారు. హైదరాబాద్ ఈనెల 11న జరిగిన అంతర్జాతీయ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రిషివర్ధన్, హర్షవర్ధన్ బంగారు పతకాలు సాధించారని ప్రశంసించారు. ఐపీఎస్ పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్ కుమార్, డైరెక్టర్ కృష్ణప్రియ పాల్గొన్నారు.

## లైంగిక దాడి కేసులో మూడేళ్ల జైలు

జగిత్యాలజోన్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్ర. దాన న్యాయమూర్తి, పోక్సో స్పెషల్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి జి. నీలిమ సోమవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం .. ధర్మపురి మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులు కూలీ పనులకు వెళ్లి తమ ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నారు. కూతురుకు ఉన్నత చదువుల రీత్యా ఇతర ప్రాంతంలో సీటు వచ్చింది. అదే సమయంలో కరోనాతో లాక్‌డౌన్ కావడంతో కళాశాలకు సెలవు ఇచ్చారు. దీంతో బాలిక ఇంటికి చేరింది. 2020 జూన్ 6న ఎప్పటిలాగే బాలిక తల్లిదండ్రులు ఉపాధి పనులకు వెళ్లారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన సాయిని గంగన్న వచ్చి బాలికపై అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. బాలిక అరవడంతో బెడ్‌రూమ్‌లో ఉన్న తమ్ముడు, ఆడుకునేందుకు వచ్చిన మ రో బాలుడు రావడంతో గంగన్న అక్కడినుంచి పారిపోయాడు. తల్లిదండ్రులు బాలికతో కలిసి ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమో దు చేసుకున్న అప్పటి ఎస్సై కె.శ్రీకాంత్ దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు కిరణ్‌కుమార్, రాజు, శ్రీధర్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. వాటిని పరిశీలించిన జడ్జి నిందితుడైన సాయిని గంగన్నకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.



## రాజన్నకు శ్రావణ మొక్కులు

- 35 వేల మంది దర్శనాలు
- రూ.40 లక్షల ఆదాయం



వేములవాడ: రాజన్నకు శ్రావణమాసం సందర్భంగా సోమవా రం భక్తుల తాకిడి పెరిగింది. సు మారు 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. పట్టణ పోలీ సులు బారికేడ్లు ఏర్పాటు చేసి వా హనాలను కట్టడి చేశారు. భక్తుల రద్దీ పెరగడంతో దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. భక్తుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బ్రేక్ దర్శనం క్యూలైన్‌ను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రిసెప్షన్ ఏఈవో రమేశ్ బాబు, ప్రొటోకాల్ పర్యవేక్షకులు రాజన్‌బాబు, ఎస్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.